క్లుప్తంగా

బండారులంకలో నేడు మంత్రి విశ్వరూప్ ప్రచారం

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బండారులంకలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని మండల వైఎస్సార్ సీపీ నేత బొంతు గోవిందుశెట్టి, మండల సచివాలయాల కన్వీనర్ చొల్లంగి సుబ్బారాం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రాముడు ఆదర్శ పురుషుడు

ఐ.పోలవరం: మనిషి నడవడిక ఎలా ఉండాలో, ఎలా బతకాలో మార్గదర్శనం చేసిన రాముడు ఆదర్శ పురుషుడయ్యాడని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాతయింజరంలో ఏర్పాటు చేసిన సత్సంగమం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామ నామాన్ని జపిస్తే మానవ జన్మ సార్థకమవుతుందన్నారు. ప్రతి స్త్రీ బొట్టు ధరించడం వల్ల ముఖం లక్ష్మీ కళగా ఉండటమే కాకుండా బొట్టు ద్వారా సూర్యనాడిని గ్రహించి జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గాదిరాజు విశ్వనాథరాజు, నూలు వల్లీ తాయారు, పేరాబత్తుల వెంకటరమణ, పితాని శ్రీనివాసరావు, బొంతు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి ఉగాది పురస్కారాలు



కులవృత్తుల వారిని సత్కరిస్తున్న ఆకొండి ట్రస్ట్, సంస్కార భారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్: శ్రీక్రోధి నామ సంవత్సరం సందర్భంగా స్థానిక ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్, సంస్కార భారతి సంయుక్తంగా పట్టణంలోని పలు చేతివృత్తుల వారి సేవలను గుర్తించి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశాయి. స్థానిక యర్రమిల్లివారి వీధిలో సోమవారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ సభలో పట్టణ స్వర్ణకార సంఘానికి చెందిన మానేపల్లి ఉదయ్, కమ్మరి చేతి వృత్తిదారుడు కనితి నాగేశ్వరరావు తదితరులకు పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ప్రతినిధి ఆకొండి పవన్, సంస్కార భారతి జిల్లా కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు భరణికాన బాబు, కార్యదర్శి ఓడూరి ఫణి, కోశాధికారి చింతా నాని, ఉపాధ్యక్షుడు చింతా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నానికి ఉగాది పురస్కారం



హైదరాబాద్‌లో ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న నాని

తాళ్లరేవు: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఏటా అందిస్తున్న ఉగాది పురస్కారాన్ని తాళ్లరేవు పంచాయతీ శ్రీరంగనాయకపురం గ్రామానికి చెందిన ప్రముఖ ఆస్ట్రాలజిస్ట్ వెదురుపావులూరి తాతాజీ(నాని) దక్కించుకున్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పెరుగు శ్రీసుధల చేతుల మీదుగా నాని పురస్కారం అందుకున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాలకు చెందిన 40 మందికి ఈ పురస్కారాలు అందజేయగా, ఆస్ట్రాలజీ విభాగంలో తనకు లభించడం ఆనందంగా ఉందని నాని తెలిపారు.

50 సెంట్ల భూమి దానం



సంఘ సభ్యులకు భూమి పత్రాలు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు దంపతులు

ఐ.పోలవరం: మండలంలోని పశువుల్లంక గ్రామానికి చెందిన గోడి నాగేశ్వరరావు, సుజాత దంపతులు తమకున్న 50 సెంట్ల లంక భూమిని అంబేడ్కర్ యువజన సంఘానికి దానం చేశారు. ఈ మేరకు భూమి పత్రాల్ని దాత నాగేశ్వరరావు దంపతులు సంఘ సభ్యులకు సోమవారం అందజేశారు. నాగేశ్వరరావు వృత్తి రీత్యా విశాఖపట్టణంలో స్థిరపడ్డారు. పుట్టిన ఊరికి ఏదో చేయాలన్న సదుద్దేశంతో భూమి దానం చేసిన నాగేశ్వరరావు కుటుంబీకుల్ని గ్రామస్తులు అభినందించారు.

రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకకు చెందిన కట్టా లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సోమవారం రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే పొన్నాడ తనయులు సత్య సుమంత్, రేవంత్
- మురమళ్ల, కేశనకుర్రుల్లో ఎన్నికల ప్రచారం



కేశనకుర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రేవంత్ తదితరులు



మురమళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సత్య సుమంత్ తదితరులు

ఐ.పోలవరం: సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే పొన్నాడ తనయులు సత్య సుమంత్, రేవంత్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ సోమవారం వారిద్దరూ మురమళ్ల, కేశనకుర్రు గ్రామాల్లో, మురమళ్ల హైస్కూల్ రోడ్డు, మాణిక్యాంబ నగర్‌ల్లో పర్యటించి ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమ తండ్రి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి మళ్లీ ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా సుమంత్, రేవంత్‌లు మాట్లాడుతూ కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలను కొనసాగిస్తానంటూ చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నాడని, ప్రజలు నమ్మవద్దని కోరారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందుతుందన్నారు. గత టీడీపీ హయంలో ఏ చిన్న పనికైనా ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచారన్నారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతి పని వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గత టీడీపీ హయాం నుంచి పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం జగన్ చెల్లుచీటీ పలికారన్నారు. జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. భారతదేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తమ తండ్రి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, రాపాక వరప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాశీ రాజుబాబు, పెన్మత్స వాసురాజు, నడింపల్లి గణపతి మూర్తివర్మ, గోకవరపు మల్లిబాబు, శీలం సాయి తదితరులు పాల్గొన్నారు. కేశనకుర్రు గ్రామంలో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రచారానికి రెండు రోజులే గడువు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న జరగనున్న ఎన్నికల్లో భాగంగా యానాం రీజియన్‌లో వివిధ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రచారానికి ఇక రెండు రోజులే గడువు ఉండటంతో బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా రంగంలో ఉన్న నమశ్శివాయంకు మద్దతుగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు తదితరులు నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతున్నారు. మరోవైపు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మద్దతుదారులు సైతం ప్రచారాన్ని చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వైథిలింగం గెలుపు కోరుతూ మల్లాడి సత్తిబాబు, బంగారం, చక్రవర్తి తదితరులు విస్తృతంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పుదుచ్చేరి నుంచి వచ్చి ఎన్డీయే కూటమి అభ్యర్థి నమశ్శివాయం, కాంగ్రెస్ అభ్యర్థి వైథిలింగం, అన్నాడీఎంకే అభ్యర్థి తమిళవేందన్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ తదితరులు యానాంలో తమ వ్యక్తిగత ప్రచారాలను పూర్తి చేశారు. యానాంలో ఆ పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు.

పెన్షనర్ల భవన ఆధునీకరణకు రూ.75 వేల విరాళం



భవన ఆధునీకరణకు చెక్ అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు పాపారావు

అమలాపురం టౌన్: స్థానిక ఏవీఆర్ నగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లా శాఖ అసోసియేషన్ భవనం ఆధునీకరించే పనుల నిమిత్తం జిల్లా అధ్యక్షుడు కృష్ణశాస్త్రికి విశ్రాంత హిందీ పండితుడు సూతాపల్లి పాపారావు రూ.75 వేల చెక్కును విరాళంగా అందజేశారు. భవనం పైఅంతస్తులోని ఆఫీస్ రూమ్‌కు దాత సూతాపల్లి పాపారావు పేరు పెట్టేందుకు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఎన్‌వీఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు, ఎం.సాయి వరప్రసాదరావు, చిక్కం సూర్యనారాయణ, డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, చిక్కం ప్రసాద్, మహ్మద్ షహీరా తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో అన్నదానం

అమలాపురం టౌన్: కోనసీమ ఆహార నిధి సంస్థ ఆరో వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ బృందం ఆధ్వర్యంలో తొలుత స్థానిక బుద్దాల బ్లడ్ బ్యాంక్‌లో ఆహార నిధి సంస్థకు చెందిన పలువురు రక్తదానం చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో రోగులకు బ్రెడ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, విద్యానిధి సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ అనూష, కోనసీమ ఆహార నిధి సంస్థ సేవా బృందం ప్రతినిధులు గట్టెం వీరు, బందారు సురేష్, చీకట్ల కిరణ్, ఆకుల ఆర్కే నాయుడు, కొప్పుల సంతోష్, నామన నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీ



ముమ్మిడివరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ముమ్మిడివరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని విష్ణాలయం సెంటర్, హైస్కూల్ సెంటర్, బల్ల గేటు సెంటర్లలో అవగాహన ర్యాలీ జరిగింది. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి మురళీ కొండబాబు, కేఏఎస్ఎస్ నారాయణ, కె.శ్రీనుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

అమలాపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను పలు కూడళ్లలో ప్రజలకు అందజేశారు. గడియారం స్తంభం సెంటరు, మెయిన్ రోడ్డు, ఆర్టీసీ బస్‌స్టేషన్, హైస్కూలు సెంటరు, పలు షాపింగ్ మాల్స్‌లో కరపత్రాల పంపిణీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక దళాధికారి కొండబాబు, లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్ ప్రజలకు వివరించారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు గాంధీనగర్‌లోని కోదండ రామాలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్మార్త ఆగమ పండితులు బ్రహ్మశ్రీ ఏలూరిపాటి ప్రభాకర్ శర్మ, వేద పండితులు మర్ల ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం 8.26 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం మహా పూర్ణాహుతి, గోదృష్టి నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పూజ కార్యక్రమాలకు దాట్ల సుబ్బరాజు, పితాని బాలకృష్ణ, దొరబాబు, బి.శ్రీనివాసరెడ్డి, మేడిశెట్టి నారాయణరావు, బొంతు శ్రీను, సూరంపూడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే నిరుపేదలకు మేలు

కుత్బుల్లాపూర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే నిరుపేదలకు మేలు జరుగుతుందని యర్రగరువు గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. ప్రధానంగా ఐ.పోలవరం మండలం జె.మూలపాలెం పంచాయతీ యర్రగరువు గ్రామ యాదవ కులస్తులు తెలంగాణకు చెందిన కొంపల్లిలో అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో యర్రగరువు గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, భైరవస్వామి, కటమ కోయలక్ష్మి, సత్తిరాజు, రాష్ట్ర డైరెక్టర్ దండవోలు వెంకటరమణ, సొసైటీ డైరెక్టర్ గంగుల శ్రీను, గంగుల వెంకటేశ్వర్లు, మందపాటి నాగబాబులు కొంపల్లిలోని ఓటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కుట్రలు, కుయుక్తులు, కుతంత్రాలకు నెలవైన టీడీపీ, దాని మిత్ర పక్షం బీజేపీ, జనసేనలతో పాటు ఎల్లో మీడియా చేస్తున్న అసత్య ప్రచారాలను ఎండగట్టారు. ఐదేళ్ల కాలంలో సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశానికే దిక్సూచిగా నిలిపిన జగనన్న మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. ఏకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడులకు తెగపడుతూ అంతమొందించేందుకు టీడీపీ చేసిన కుట్రను తెలియజేశారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే పేదల బతుకులు బాగుపడతాయని, పేద ప్రజలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో ప్రజలు గెలవాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. దీంతో కొంపల్లిలో ఉంటున్న ముమ్మిడివరం నియోజకవర్గ వాసులు రానున్న ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు జగన్‌కే అంటూ ప్రతినబూనారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



చొల్లంగిపేటలో రాజీనామా చేసిన వలంటీర్లు

తాళ్లరేవు: చొల్లంగిపేట గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 18 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఎంతో గౌరవం ఇచ్చిన తమ నాయకుడి విజయం కోసం పనిచేస్తామని తెలిపారు.

వలంటీర్ రాజీనామా

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ క్లస్టర్–21 పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్ ఉల్లింగి సుధారాణి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు సోమవారం అందజేశారు. తనకి వలంటీర్ ఉద్యోగం కంటే మంత్రి విశ్వరూప్ గెలుపు ముఖ్యమని సుధారాణి తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా



చెక్ పోస్టుల వద్ద వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు మద్యం అక్రమ రవాణాపై నిఘాను మరింత విస్తృతం చేశాయి. ఇదే సమయంలో చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు, నగదు సీజ్‌లు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో ఈ నిఘా పకడ్బందీగా జరుగుతోంది. జిల్లాలో ఆదివారం జరిగిన మద్యం అక్రమ రవాణా, పట్టుబడ్డ మద్యం, అరెస్ట్ అయిన వారి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం రాత్రి వివరించింది.

- ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రెండు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని 2,499 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- ఆలమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 100 లీటర్ల నాటు సారా, ఓ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- రామచంద్రపురం, పామర్రు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 16 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 8 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 4.32 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.7,480 స్వాధీనం చేసుకున్నారు.
- ముమ్మిడివరం, ఆలమూరు, రాజోలు, రామచంద్రపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 58 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 11.49 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.
- మండపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేసి రూ.1,28,831 సీజ్ చేశారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహనాలను ఆపి సోమవారం విస్తృతంగా తనిఖీలు చేశారు.
- పామర్రు పోలీస్‌స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలైన శివల, అద్దంపల్లి, ఎర్ర పోతవరం ప్రాంతాల్లో పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి సోమవారం కవాతు నిర్వహించి ఎన్నికల్లో భరోసాగా ఉంటామని ప్రజలకు ధైర్యం కల్పించారు.

17, 18 తేదీల్లో విద్యాసంస్థలకు సెలవు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో నాలుగు రీజియన్లలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టరేట్ ఆఫ్ హయ్యర్ అండ్ టెక్నికల్ అమన్‌శర్మ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయా విద్యాసంస్థల్లో పోలింగ్ స్టేషన్స్, కౌంటింగ్ సెంటర్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో సెలవులు ప్రకటించామన్నారు.

సినిమా షోల నిలుపుదలకు ఆదేశాలు

యానాం: లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో సినిమా థియేటర్లలో ప్రదర్శనలు నిలిపివేయాలని సబ్ డివిజినల్ మెజిస్ట్రేట్ ఆర్.మునిస్వామి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా 18వ తేదీ మధ్యాహ్నం, రాత్రి షోలు, అదే విధంగా 19వ తేదీ అన్ని షోలు ప్రదర్శించకుండా నిలుపుదల చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా థియేటర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

వీరభద్రుని ఆలయానికి శంకుస్థాపన



నూతన ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలో ఇమ్మిడివరప్పాడు గ్రామంలో కరికాలభక్తుల సంఘం ఆధ్వర్యంలో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామివారి నూతన ఆలయానికి శంకుస్థాపన సోమవారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి భూమి పూజలో పాల్గొన్నారు.

మండలంలో నేడు ఎన్నికల ప్రచారం

ముమ్మిడివరం: మండలంలోని అన్నంపల్లి, కమిని, గాడిలంక గ్రామాల్లో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని పార్టీ కార్యాలయ ప్రతినిధులు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నేత పితాని బాలకృష్ణతో కలిసి మంగళవారం ఉదయం 9 గంటలకు అన్నంపల్లి, మధ్యాహ్నం 2 గంటలకు కమిని, సాయంత్రం 4 గంటలకు గాడిలంకలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అమ్మమ్మ ఉచిత యోగా శిక్షణా కేంద్రం ప్రారంభం



యోగా టీచర్ సుబ్బలక్ష్మిని సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలో యోగా టీచర్ సుబ్బలక్ష్మి ఏర్పాటుచేసిన అమ్మమ్మ ఉచిత యోగా శిక్షణా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. 80 ఏళ్ల వృద్ధురాలైన సుబ్బలక్ష్మి అందరికీ యోగా నేర్పించాలన్న తపనతో చేస్తున్న ప్రయత్నాన్ని పట్టణానికి చెందిన శ్రేయ మానసిక పిల్లల ప్రత్యేక పాఠశాల వ్యవస్థాపకుడు, చిన్న పిల్లల వైద్యుడు కె.శ్రీమన్నారాయణ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించి ఆమె చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి వలవల వెంకట రెడ్డి నాయుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో తనిఖీలు విస్తృతం చేయాలి



పోలేకుర్రు వై.జంక్షన్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ విజయ

తాళ్లరేవు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల్లో తనిఖీలను విస్తృతం చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మంగళగిరి అసిస్టెంట్ కమిషనర్ విజయ ఆదేశించారు. సోమవారం ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలేకుర్రు వై.జంక్షన్, సుంకరపాలెం చెక్‌పోస్టులను ఆమె ఆకస్మికంగా సందర్శించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట కాకినాడ సౌత్ సీఐ ఆర్.జయరామ సతీష్, నార్త్ సీఐ పెద్దిరాజు, తాళ్లరేవు చెక్‌పోస్టు సబ్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్లతో సమావేశం



మైక్రో అబ్జర్వర్లతో సమావేశమైన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న జరగనున్న ఎన్నికల సందర్భంగా యానాం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన విధులపై మైక్రో అబ్జర్వర్లకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మునిస్వామి సోమవారం పలు సూచనలు ఇచ్చారు. స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో జరిగిన మైక్రో అబ్జర్వర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటర్లకు తాగునీరు, ఫర్నీచర్, లైటింగ్, షెడ్స్ తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతిఒక్కరూ విధులు సక్రమంగా నిర్వహించి పోలింగ్ విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న తమిళవేందన్, అన్బళగన్

యానాం: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కనకాలపేట డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించడానికి పుదుచ్చేరి స్థాయిలో కృషి చేస్తానని ఏఐఏడీఎంకే అభ్యర్థి తమిళవేందన్ తెలిపారు. సోమవారం ఆయన ప్రచార కార్యక్రమంలో భాగంగా కనకాలపేట ఏటిగట్టును ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డు వల్ల సమీప గ్రామాల్లో నివాసితులు పడుతున్న ఇబ్బందులను యానాం అన్నాడీఎంకే కార్యదర్శి మంచాల సాయికుమార్ వివరించారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బళగన్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసేసి వీరంగం

అమలాపురం టౌన్: పట్టణంలో మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసేసి వీరంగం సృష్టిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ ఆదేశాలతో ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్న సదరు ఇద్దరు వాహన చోదకులను అరెస్ట్ చేసి మోటారు సైకిళ్లను సీజ్ చేసినట్లు పట్టణ ఎస్ఐ కిషోర్ తెలిపారు.